## క్లుప్తంగా

### సచివాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన



సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రమేష్

**కామవరపుకోట :** మండలంలోని తడికలపూడి గ్రామంలో రూ.40 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న రెండవ సచివాలయం భనులను గురువారం జెడ్పీటీసీ కడిమి రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నార న్నారు. భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపీటీసీ గంగుల కడియాలు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌బీకేల ద్వారా మొక్కజొన్న కొనుగోలు



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

**పోలవరం రూరల్ :** పోలవరం మండలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోలును ముమ్మరం చేసినట్లు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. పోలవరం, పాత పట్టిసీమ, కొత్త పట్టిసీమ ఆర్బీకేల్లో రైతుల నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులను కూడా సరఫరా చేస్తున్నామన్నారు. వర్షం పడినప్పటికీ మొక్కజొన్న తడవకుండా పట్టిసీమ ఎత్తిపోతల పథకం సమీపంలోని గోడౌన్‌లో భద్రపరుచుకునేందుకు సంబంధిత అధికారులతో కూడా మాట్లాడినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ధాన్యాన్ని సొసైటీ గోడౌన్‌లలో భద్రపరచాలని ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఎక్కడైనా ఐకేపీ గోడౌన్‌లు ఉంటే రైతులు వినియోగించుకోవాలన్నారు. పాఠశాలలు మూసివేసినందున ఆ ప్రాంతంలో కూడా రైతులు భద్రపరుచుకోవచ్చన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబుతో కలిసి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు పరిస్థితిపై రైతులతో మాట్లాడారు.

### జగనన్న శాశ్వత భూహక్కును వినియోగించుకోండి



మాట్లాడుతున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వరహాలరాజు

**చింతలపూడి :** జగనన్న శాశ్వత భూహక్కు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నూజివీడు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వరహాలరాజు విజ్ఞప్తి చేశారు. జగనన్న శాశ్వత భూహక్కు కార్యక్రమంలో భాగంగా చింతలపూడి మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్‌ఓలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీసర్వేలో భాగంగా డ్రోన్ ఫ్లై సర్వే గురించి అవగాహన కలిగించారు. ఈనెల 15వ తేదీ నుంచి డ్రోన్ ఫ్లై సర్వే పనులు ప్రారంభమవుతాయని సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ జ్యోతి, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

### వేధింపుల కేసు నమోదు

**జంగారెడ్డిగూడెం :** తనను ఒక వ్యక్తి లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని మైసన్నగూడెంకు చెందిన సీహెచ్ రమ్య, తన భర్తతో కలిసి కూలి పని చేసుకుని జీవిస్తోంది. ఆమెకు ఇద్దరు సంతానం. అదే గ్రామానికి చెందిన జుత్తుక గిరి అనే వ్యక్తి రమ్య కూలీ పనికి వెళ్లి వస్తున్న సమయంలో వెంటపడుతూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. అంతేగాక ఇటీవల ఆమె ఇంటి వద్ద ఉన్న సమయంలో గిరి అసభ్యంగా ప్రవర్తించడంతో, రమ్య భర్త గిరిని అడ్డుకున్నాడు. ఈ క్రమంలో కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేశాడని, ఇదే విషయాన్ని గ్రామ సర్పంచ్‌కు తెలియజేసినప్పటికి ఫలితం లేకపోవడంతో రమ్య గురువారం స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ఢీకొన్న ఆర్టీసీ బస్సు, ఆటో

**జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెంలో తల్లాడ – దేవరపల్లి జాతీయ రహదారిపై బైనేరు వాగు వద్ద గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో బైనేరు వాగు పక్కకు వంతెనపై నుంచి బోల్తా కొట్టి పడిపోయింది. ఆటో డ్రైవర్ ఏలూరి లింగమూర్తిరాజుకు స్వల్ప గాయాలు కాగా, అతడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్సై సాగర్‌బాబు తన సిబ్బందితో వెళ్లి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు, క్షతగాత్రుడిని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ఆదరణ

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- నందాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



నందాపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



శ్రీనివాసపురంలో సంక్షేమ లబ్ధి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

**బుట్టాయగూడెం :** రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల ముఖాల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని నందాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని స్థాపించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థను నెలకొల్పారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ పథకాలను పారదర్శకంగా వారి ఇంటికే అందజేస్తున్నారని చెప్పారు. నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చారని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. నాడు- నేడు పనుల ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చారని విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించేందుకు నిరంతరాయంగా పనిచేస్తున్నారని తెలిపారు. మహిళా సాధికారిత కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నారని వెల్లడించారు. వైఎస్సార్ సీపీపై ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, జెడ్పీటీసీ మొడియం రామతులసి, కోఆప్షన్ సభ్యులు షైదు బాజీ, సర్పంచ్ బన్నే బుచ్చిరాజు, ఎంపీటీసీలు సవలం కోటేశ్వరరావు, మొడియం వెంకమ్మ, నాయకులు దినేష్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీనివాసపురంలో గడపగడపకు**

**జంగారెడ్డిగూడెం రూరల్ :** సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో 2వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి 136వ రోజుకు చేరిన సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా చేతుల మీదుగా కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత మహిళలు హారతులతో ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రూ.3 కోట్ల 74 లక్షల నిధులతో జంగారెడ్డిగూడెం నుంచి వయా శ్రీనివాసపురం మీదుగా ములగలంపల్లి వెళ్లే రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వర్జీనియా పొగాకు రైతుల వద్దకు వెళ్లి బ్యారన్ పొగాకు పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలకు ఏమేర లబ్ధి చేకూరింది, వారి సమస్యలేంటో తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. శ్రీనివాసపురంలో గ్రామంలో అధిక సంఖ్యలో అర్హులకు ఇళ్లపట్టాలు, గృహాలు మంజూరు చేసినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. ఒక్క శ్రీనివాసపురం గ్రామంలోనే రూ.15 కోట్ల విలువ చేసే సంక్షేమ పథకాలు, రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా ముందుకు సాగని శ్రీనివాసపురం మీదుగా ములగలంపల్లి వెళ్లే రహదారికి తమ ప్రభుత్వం నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నార న్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, కోఆప్షన్ సభ్యులు లాల్ అహ్మద్, వైఎస్సార్ సీపీ యువ నాయకులు గంజి వినోద్, పడమటి గిరిబాబు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రాహ్మణుల పురోభివృద్ధికి సమష్టి కృషి

**జంగారెడ్డిగూడెం :** బ్రాహ్మణుల పురోభివృద్ధికి సమష్టి కృషి అవసరం అని జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు చిలుకూరి సాయిబాబు అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండి అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్‌కు స్థానిక జెడ్పీ హైస్కూల్ దగ్గర గల స్థలంలో బ్రాహ్మణ సంక్షేమ భవన నిర్మాణానికి అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై రూపకల్పన, ప్రణాళిక చేసినట్లు కార్యదర్శి కూచిభట్ల రాము వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు తిప్పాబొట్ల రామకృష్ణ, కూచి త్రినాథరావు, చిలకమర్తి బద్రినారాయణ, గన్నవరపు మాధవరావు, మీడియా సలహాదారు లంకా నాగకుమార్, మహిళా కార్యవర్గ సభ్యురాలు మదనంబేడి క్రిష్ణప్రియ, మదనంబేడి సుబ్బారావు, చిలుకూరి లక్ష్మీనారాయణ, తటవర్తి శేషగిరి, తటవర్తి మురళి తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగం అభివృద్ధికి ప్రాధాన్యత



ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సదుపాయాలపై అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎలీజా

**చింతలపూడి :** రాష్ట్రంలో వైద్య రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం రూ.కోటి 22 లక్షల వ్యయంతో మంజూరైన ల్యాబ్ పరికరాలను ఎమ్మెల్యే ఎలీజా ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలపూడి ప్రజల చిరకాల వాంఛ అయిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతుందని తెలిపారు. త్వరలోనే ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. 9,750 చదరపు అడుగుల వైశాల్యంలో 2 లక్షల మందికి ఉపయోగపడేలా ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రోగులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించే విధంగా అన్ని సౌకర్యాలతో ఆసుపత్రి నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి నియోజకవర్గానికి నూరు పడకల ఆసుపత్రి, ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసినట్లు చెప్పారు. చింతలపూడిలో 100 పడకల ఆసుపత్రి మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు, సహకరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు లభిస్తున్న వైద్య సౌకర్యాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా ఎస్‌డీ రసూల్ ఎమ్మెల్యే ఎలీజాకు వివరించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డా.రసూల్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.కాంతారావు, ఎస్.భరత్‌రెడ్డి, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ ఎ.సుబ్బారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఎం.దిలీప్, ప్రకాష్, ప్రసాదరాజు, కలపాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## 14న రెడ్డికుంకాలలో హనుమద్ మహాయజ్ఞం



అభివృద్ధి పరిచిన అభయాంజనేయస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు మార్గం




రెడ్డి కుంకాల గ్రామంలో పురాతన అభయాంజనేయస్వామి ఆలయం

**పోలవరం రూరల్ :** పోలవరం మండలంలో అత్యంత మారుమూల రెడ్డి కుంకాల గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీశ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయంలో హనుమద్ జయంతి సందర్భంగా వేద పండితుల సమక్షంలో ఈ నెల 14న హనుమద్ మహాయజ్ఞం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కుంకాల ఆనకట్ట జలాశయం ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాల క్రితం రాతితో కట్టబడిన అభయాంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించి ఉంటారని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. కొన్ని దశాబ్దాలుగా ఆ ప్రాంతమంతా పెద్ద పెద్ద చెట్లు, తుప్పలు పెరిగి ఆలయం మొత్తం తుప్పల్లో ఉండి పోయింది. అయితే ఒక వ్యక్తి ఇటీవల కాలంలో ఆ ప్రాంతంలో ఉన్న ఆలయాన్ని గుర్తించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయగా, రాతితో కట్టబడిన చిన్న ఆలయం బయట పడింది. దీంతో గ్రామస్తుల సహకారంతో నిత్యం దూప దీప నైవేద్యాలు కార్యక్రమం జరిగేలా కృషిచేశారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ మిడియం గంగాదేవి, మండల ఉపాధ్యక్షులు మిడియం సింగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటం బాబూరావు గ్రామస్తులతో కలిసి ఆలయ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టారు. దేవాలయానికి వెళ్లే మార్గం గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. అలాగే దేవాలయాన్ని సందర్శించే భక్తులకు తాగునీటి వసతి కింద ఒక చేతి పంపు కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల 14న హనుమద్ మహాయజ్ఞంతోపాటు భక్తుల సౌకర్యార్థం అన్నసమారాధన కూడా ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి తెలిపారు.

## ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న బాలరాజు

**బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) :** జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురంలో గురువారం సుమారు 21 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామంలోని భక్తులు మూడు రోజులుగా కుటుంబ సమేతంగా విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఏర్పాటు చేసిన హోమ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి ఆశీస్సులు గ్రామస్తులకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం హోమగుండాన్ని సందర్శించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, సర్పంచ్ సున్నం ఉషారాణి, ఉప సర్పంచ్ రాఘవ రెడ్డి, ఎంపీటీసీ కంచర్ల సుధారాణిల చేతుల మీదుగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు దేవుని చిత్రపటాలను అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ నాయకులు జెట్టి గురునాథరావు, మేడవరపు విద్యాసాగర్, పరిమి సత్తిపండు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అదేవిధంగా ఎస్సై వి.చంద్రశేఖర్, ఎంపీటీసీ సున్నం సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చందా ప్రసాద్, కెక్కిరాల రాము, కుక్కల రాంపండు, పైడిచర్ల జగన్‌మోహన్‌రెడ్డి, కోర్సా వెంకటేశ్వరరావు, చిట్టిబొమ్మ శ్రీను, కంచర్ల పాండు, ఆకుల రవి, చక్రవర్తి, చౌదరి రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

## విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



చిత్రలేఖనంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న శాఖ గ్రంథాలయ అధికారి ఎం.భీమరాజు

**కామవరపుకోట :** స్థానిక కామవరపుకోట శాఖ గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆ శాఖ గ్రంథాలయం అధికారి ఎం.భీమరాజు అన్నారు. విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించే దిశగా ఈ శిక్షణా శిబిరంలో పుస్తక పఠనం, చిత్రలేఖనం, చెస్, క్యారమ్స్ గేమ్స్‌లలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, ఎంపీ స్కూల్, ఆదిత్య స్కూల్ విద్యార్థులకు వారికి నచ్చిన బొమ్మలను చిత్రలేఖనం గీయించి, పుస్తక పఠనం చేయించారు.

**జంగారెడ్డిగూడెం :** పట్టణంలోని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పి.దుర్గారావు మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం సమాజహితం, సమాజంలో విద్యార్థుల పాత్ర, ప్రాముఖ్యత, అనుసరించాల్సిన విధానాలపై వివరించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఆధ్యాత్మికవేత్త తిప్పాభట్ల రామకృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠకులు శిరీషా, ఎన్.విజయకుమార్, 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## కళారూపకాలపై శిక్షణ పొందాలి

**ఏలూరు (టూటౌన్):** ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు వివిధ కళారూపాలపై శిక్షణ పొందాలని ఏపీ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కన్వీనర్ బళ్ల కనకదుర్గారావు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తిభవన్‌లో పిట్టా వీరయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన ప్రజానాట్యమండలి జిల్లా ముఖ్యుల సమావేశంలో కనకదుర్గారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, మతోన్మాద విధానాల వల్ల జరిగే నష్టాలను ప్రజానీకానికి తెలియజేసే విధంగా తేలిక భాషలో కథలు రూపొందించి వాటిని ప్రజా సమూహాల్లో ప్రదర్శించేందుకు ప్రజానాట్యమండలి కళాకారులు సిద్ధం కావాలని సూచించారు. మే 21, 22 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి కళాకారులకు ఏలూరులో శిక్షణ ఇవ్వాలని సమావేశం నిర్ణయించిందన్నారు. ప్రజానాట్యమండలి ఏలూరు ఇన్‌చార్జి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ప్రజానాట్యమండలి కళాకారులు భజంత్రీ శ్రీనివాసరావు, గేదెల నాగేశ్వరరావు, ఎంపీ చారి మాట్లాడారు. బాల కళాకారిణి ఉప్పులూరి లక్ష్మీ అరుణ పాడిన విప్లవ గీతాలు సమావేశాన్ని ఉత్సాహపరిచాయి.

## సత్తా చాటిన గురుకుల విద్యార్థినులు

**ద్వారకాతిరుమల:** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు సత్తాచాటినట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాణి తెలిపారు. మొత్తం 90 మంది పరీక్షకు హాజరు కాగా, 76 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అందులో 50 మంది ఫస్ట్ క్లాస్, 24 మంది సెకండ్ క్లాస్, ఇద్దరు థర్డ్ క్లాస్‌లో పాసైనట్టు చెప్పారు. బి.హర్షవర్థిని 556, బి.వర్షిణి 542, వి.రమ్య 532, కె.విజయశ్రీ 524 మార్కులు సాధించారన్నారు.

## 14వ తేదీ నాటికి స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలి



స్టోన్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

**కొయ్యలగూడెం :** స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం ఈనెల 14వ తేదీ నాటికి కొయ్యలగూడెం మండలంలో పూర్తి చేయాలని రెవెన్యూ శాఖను అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వభరత్ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలో అమలవుతున్న స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవిడిపాలెం, కుంతలగూడెం గ్రామాలలో స్టోన్ ప్లాంటేషన్ తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇప్పటివరకు సుమారు పదిహేను వేలకు పైగా స్టోన్ ప్లాంటేషన్లు నిర్వహించామని మరో ఐదువేలు నిర్వహించాల్సి ఉందని అధికారులు అసిస్టెంట్ కలెక్టర్‌కు నివేదించారు. స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తయితే రైతులకు ప్రయోజనం కలగడంతో పాటు ప్రభుత్వ స్థలాల గుర్తింపునకు వీలు కలుగుతుందని ప్రక్రియ వేగవంతానికి అధికారులతో పాటు వీఆర్‌ఏలను నియమిస్తామని అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు.

## క్రాంతి ప్రసాద్ కుటుంబానికి పరామర్శ

**దెందులూరు:** ఉపాధి హామీ పథకం దెందులూరు టెక్నికల్ అసిస్టెంట్ క్రాంతి ప్రసాద్ కుటుంబానికి త్వరితగతిన ప్రభుత్వ ఉద్యోగం మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. దెందులూరులో ఇటీవల మృతిచెందిన క్రాంతి ప్రసాద్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గురువారం పరామర్శించారు. ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**జంగారెడ్డిగూడెం :** విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కేఎం అంబేడ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి దర్భగూడెం వైపుగా ఉన్న 33 కేవీ దర్భగూడెం ఫీడరు, పేరంపేట సబ్‌స్టేషన్ పరిధిలో, జంగారెడ్డిగూడెం పట్టణంలోని సుబ్బారెడ్డి కాలనీ, రాజుల కాలనీ, బైపాస్ రోడ్ వెంబడి లైన్‌లలో ట్రీ కటింగ్, లైన్ల నిర్వహణ నిమిత్తం సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పర్యావరణాన్ని పరిరక్షించాలి



ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

**కొయ్యలగూడెం :** ప్రపంచ పర్యావరణ అమలుతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని ఫారెస్ట్ రేంజర్ కె.కృష్ణకుమారి పేర్కొన్నారు. గురువారం కన్నాపురంలోని అటవీ శాఖ కార్యాలయం వద్ద పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అటవీ శాఖ అధికారులు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కోలాట నృత్యం

**పెదవేగి :** లక్ష్మీపురం గ్రామంలో శ్రీహరి శ్రీనివాస కోలాట భజన బృందం ఆధ్వర్యంలో గురువారం రాత్రి గజ్జపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా నేర్చుకున్న బృందం సభ్యులు నిర్వహించిన కోలాట నృత్యం ఆకట్టుకుంది. కోలాటం నేర్పిన గురువు సత్తార్‌ను తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి సత్కరించారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న కోలాట బృందాలతో భారీ ప్రదర్శన ఏలూరులో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జాస్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు జాస్తి లక్ష్మీనారాయణ, వల్లభనేని సురేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

**దెందులూరు:** జోగన్నపాలెం రామాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని ధ్వజస్తంభం, యాగశాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి ప్రభాకరరావు, సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సొసైటీ మాజీ చైర్మన్ డాక్టర్ పసుమర్తి మధు పాల్గొన్నారు.